# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పురాతన కాలం నాటి విజ్ఞానం జ్ఞాన్ భారతం మిషన్ ద్వారా డిజిటలైజ్ అవుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**

2. **భారత్ లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమాతరంగా చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **తెలంగాణాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు.**

4. **నిర్దేశించిన లక్ష్యాలను అందుకునేందుకు కమర్షియల్ ట్యాక్స్ యంత్రాంగం యావత్తు కృషి చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు**

5. **రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని పురపాలక శాఖమంత్రి  పొంగూరు నారాయణ అన్నారు.**

=========================

పురాతన కాలం నాటి విజ్ఞానం 'జ్ఞాన్ భారతం మిషన్' ద్వారా డిజిటలైజ్ అవుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరిగిన జ్ఞాన్ భారతం అంతర్జాతీయ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న ప్రసంగించారు. వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న భారతదేశ చింతన, ఆచార్యుల బోధనలు, మన శాస్త్రీయ జ్ఞాన సంప్రదాయాలు విలువైన జ్ఞాన సంపద అని పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే జ్ఞాన్ భారతం మిషన్ అంతర్జాతీయ సమావేశం, పోర్టల్ ప్రారంభం జరిగాయని చెప్పారు. ఇది భారతదేశ సంస్కృతి, సాహిత్యం, చైతన్యాన్ని వెల్లడించబోతోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

..వాయిస్..35 సెకన్లు

---------------------------

భారత 15వ ఉప రాష్ట్రపతిగా సి.పి. రాధాకృష్ణన్ నిన్న ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, పూర్వ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జె.పి. నడ్డా, పియూష్ గోయల్, నితిన్ గడ్కరీ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. నూతన ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. రాధాకృష్ణన్ అంకితభావంతో కూడిన ప్రజా సేవకుడని, ఆయన తన జీవితాన్ని జాతి నిర్మాణం, సామాజిక సేవకు అంకితం చేశారని కొనియాడారు. ప్రజాసేవకు అంకితమై, ఉప రాష్ట్రపతి పదవిలో ఆయన విజయవంతంగా కొనసాగాలని నరేంద్రమోదీ ఆకాంక్షించారు.

---------------------------

భారత్ లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటిని సమాతరంగా చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో వే టు న్యూస్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్ లో నిన్న ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వివిధ పథకాల ద్వారా సంక్షేమం అందిస్తూ, అభివృద్ధికి కూడా అదే తరహాలో ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు. విజన్ రూపకల్పన చేయడంతో పాటు దానిని సాధ్యం చేసే దిశగా పని చేయాలన్నారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్ -2047, రాష్ట్రస్థాయిలో స్వర్ణాంధ్ర-2047 విజన్ సిద్ధం చేశామని చెప్పారు. ప్రతి సంవత్సరానికి ప్రణాళికలు రూపొందిచుకున్నామని.. గత ఏడాది, ఈ ఏడాది రెండంకెల వృద్ధి సాధించగలిగామన్నారు. 2029-2034 నాటికి 57 లక్షల 21 వేల 610 కోట్ల రూపాయలను అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య వాణిజ్య ప్రాధాన్యతకు సంబంధించిన ప్రపంచ వ్యవస్థ - గ్లోబల్ సిస్టమ్ ఆఫ్ ట్రేడ్ ప్రిఫరెన్సెస్ - జీఎస్టీపీ సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, దీనిని సాధించే బాధ్యత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

వాయిస్.. 33 సెకన్లు

---------------------------

హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. శిథిలమవుతున్న పాత ఇళ్లల్లో నివసించే వారిని గుర్తించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. హైడ్రా, జిహెచ్ఎంసి, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం, అగ్నిమాపక దళం. ట్రాఫిక్ పోలీస్ విభాగాల సిబ్బంది ప్రజల భద్రత కోసం సమన్వయంతో పనిచేయాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించాలని చెప్పారు.

---------------------------

నిర్దేశించిన లక్ష్యాలను అందుకునేందుకు కమర్షియల్ ట్యాక్స్ యంత్రాంగం యావత్తు కృషి చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆయన కమర్షియల్ టాక్స్ అధికారులతో సమీక్షా సమావేశం నిన్న నిర్వహించారు. ఆదాయం కోల్పోతున్న ప్రాంతాలను గుర్తించాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు, వ్యాపార లావాదేవీలను కేంద్ర కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి కమర్షియల్ ట్యాక్స్ శాఖ ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తానని ఆయన తెలిపారు. జీఎస్టీ రేట్ రేషనలైజేషన్ ద్వారా రాష్ట్రం కోల్పోతున్న ఆదాయాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని చెప్పారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించేలా వస్తు సేవల పన్ను జీఎస్టీలో మార్పులు

తీసుకురావడాన్ని పల్నాడు జిల్లా ప్రజలు స్వాగతిస్తున్నారు. ఈ మార్పుల ద్వారా నిత్యావసర వస్తువులతో పాటు ఆహార పదార్థాల ధరలు తగ్గుతాయని పల్నాడు జిల్లాకు చెందిన ఒక వ్యాపారి ఆకాశవాణికి తెలియజేస్తూ,

- వాయిస్... 28 సెకన్లు

---------------------------

రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిన్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రగా మార్చాలంటే ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని, ఎవరికి వారు తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రాష్ట్రమంతా స్వచ్ఛత నెలకొంటుందని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాలో డయేరియాతో ఒక వ్యక్తి చనిపోయారని వచ్చిన వార్తలన్నీ అవాస్తవం అని జిల్లా వైద్యారోగ్య అధికారి సుహాసిని స్పష్టం చేశారు. గత రాత్రి విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరి పేట వద్ద ఏర్పాటుచేసిన డయేరియా మెడికల్ క్యాంపులో ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. చనిపోయిన వ్యక్తి గుండె నొప్పితో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మరణించినట్లు వైద్యులు స్పష్టం చేశారని ఆమె తెలుపుతూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఉత్తరాంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిషా తీరం వెంబడి పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఈరోజు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి బి.శేఖర్ తెలియజేస్తూ...

వాయిస్..21 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================